"మీ డ్రైవర్ చాలా బాగున్నాడు సువర్చలా"

మిసెస్ ప్రకాష్ నోటి నుంచి వచ్చిన ఆ మాట విని సువర్చల ఏ మాత్రం ఆశ్చర్యపోలేదు.

కొత్త డ్రైవర్ అమర్ వచ్చిన దగ్గిర నుంచి ఇంటా బయటా ఇటువంటి ప్రశంస వినబడుతూనే వుంది.

పాత డ్రైవర్ నర్సయ్య కూతురుకు కాన్పు కష్టమై చనిపోతే రెండు నెలల వరకూ రానని చెప్పి బందరు వెళ్ళిపోయాడు. అప్పటి నుంచీ డ్రైవర్ లేక కారు మూలపడింది. సువర్చల భర్త శ్యామసుందరం ఓ ప్రైవేట్ కంపెనీ మేనేజర్. ఆయనకు డ్రైవింగు వచ్చుగానీ హైదరాబాద్ వంటి రద్దీ వీధుల్లో డ్రైవ్ చెయ్యడం చాలా భయం!

# డ్రైవర్

## నందం రామారావు

ఇక సువర్చలకు ఎన్నెన్నో బాధ్యతలు, మరెన్నో వ్యవహారాలు. కారులేక పోతే క్షణం ఆవిడకు గడవదు. పిల్లలిద్దరూ కాన్వెంటుకు బస్సులోనే వెడతారు. అంచేత డ్రైవర్ లేకపోవడం వల్ల ఎక్కువగా ఇబ్బందిపడేది పెద్దవాళ్ళిద్దరే.

శ్యామసుందరానికి కంపెనీకి వెళ్ళాలన్నా, బార్‌కి వెళ్ళాలన్నా, ప్రియురాలు 'రోజీ' ఇంటికి వెళ్ళాలన్నా కారు లేకపోవడంతో చాలా ఇబ్బందిగా వుంది. ఇక సువర్చల విషయం చెప్పనక్కర్లేదు. [illegible] వల్ల పిచ్చెక్కినట్టుగా వుంది.

ఆ రాత్రి భర్తకు గట్టి వార్నింగ్ ఇచ్చింది సువర్చల. 'ఏవండోయ్! మీరు కొత్త డ్రైవర్ని చూడకపోతే లాభం లేదు. వచ్చే వారం నాకు చాలా కార్యక్రమాలున్నాయి. కారు గనుక లేకపోతే చాలా చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. అందరి ఎదుటా అవమాన పడాల్సి వస్తుంది. వింటున్నారా?"

శ్యామసుందరానికి చిరెత్తుకొచ్చింది.— "ఊరికే గొడవ పెట్టకు. ఏదో విధంగా ఏర్పాటు చేస్తాలే" విసుగ్గా అన్నాడు.

"ఏం చేస్తారో ఏమో. తెల్లవారేసరికి డ్రైవర్ వాకిట్లో వుండాలి. పెద్ద కంపెనీకి మేనేజరని పేరు. ఒక్క డ్రైవర్‌ని చూడలేకపోయారు".

ఆ ప్రవాహం ఇక ఆగదని తెలిసి శ్యామసుందరం కోటు తొడుక్కుని ప్రియురాలు రోజీ ఇంటికి బయలుదేరాడు.

* * *

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలకల్లా కొత్త డ్రైవర్ అమర్ గుమ్మంలో నిలబడివున్నాడు.

పెద్ద కోటు, తలమీద తెల్ల టోపీ, మెడని కప్పుతున్న గళ్ళ మఫ్లర్, సన్నగా, తెల్లగా ముట్టుకుంటే మాసిపోయేటంత సున్నితంగా వున్నాడు అమర్.

సువర్చల అతని వేపు గుడ్లప్పగించి చూస్తుండిపోయింది.

"నమస్కారం అమ్మగారు! నేను కొత్త డ్రైవర్ని." వినయంగా నమస్కారం చేశాడు అమర్.

"అలాగా నీ పేరేమిటి?" అప్పుడప్పుడే వస్తున్న అతని మీసాల వేపు చూస్తూ అడిగింది.

"అమర్" బొంగురు గొంతుతో చెప్పాడు.

"మనిషికి తగ్గట్టు గొంతు లేదు" అని అనుకుంది సువర్చల.

డ్రైవింగ్‌లో ఎన్నేళ్ళు సర్వీసు వుంది?""

అమర్ నవ్వాడు. నవ్వి— "అమ్మగారూ! నా గురించి నేను చెప్పకోకూడదు. మీరొక్కసారి కార్లో కూర్చుని చూడండమ్మా. నా డ్రైవింగ్ మీకే తెలుస్తుంది. మీరెక్కడికి వెళ్ళాలన్నా క్షణంలో తీసుకెడతాను" అన్నాడు.

సువర్చల పావుగంటలో తయారయి వచ్చి కార్లో కూర్చుంది. అమర్ చెప్పినట్టుగానే ఒక గంటలో సిటీ అంతా తిప్పి తీసుకొచ్చాడు. ఆ రోజల్లా కనిపించిన వారందరి దగ్గరా అమర్‌ని మెచ్చుకుంటూనే వుంది సువర్చల.

అతి కొద్ది కాలంలో అమర్ ఇంటా బయటా కూడా అందరి మన్ననకూ పాత్రుడయ్యాడు.

ఓ రోజు రాత్రి ఏడు గంటలు దాటిన తర్వాత ఎదురింటి సుజాత వచ్చి— "ఆంటీ! అమర్ వున్నాడే?" అంది.

"ఎందుకూ?" అంది సువర్చల.

"ఈవేళ మా డ్రైవర్ రాలేదు కొంచెం బజారు పని వుంది. అమర్‌ని పంపిస్తారేమోనని" అంది సుజాత నవ్వి.

సుజాత వాలకం ఎందుకో సువర్చలకు నచ్చలేదు. "అమర్ లేదు. ఇంటికెళ్ళిపోయాడు" అంది.

సుజాత నవ్వి— "అలా అంటే ఎలా ఆంటీ! అమర్ మీ ఇంట్లోనే గదా వుండేది. ఒక్కసారి పంపించవూ?" అంది.



"ఇప్పుడు లేదు. ఎక్కడికో వెళ్ళాడు. రాగానే పంపుతాను" అంటూ సువర్చల లోపలకెళ్ళిపోయింది.

అమర్‌కి 'నా' అనే వాళ్ళెవ్వరూ లేరు. అతను డ్రైవర్‌గా చేరినప్పటి నుంచి, శ్యామసుందరం ఇంట్లోనే వుంటున్నాడు. రాత్రి పూట శ్యామసుందరం గదికి ప్రక్క గదిలోనే పడుకుంటాడు అమర్. శ్యామసుందరం పడుకునే వరకూ అతని గదిలో కూర్చుని కబుర్లు చెప్పడం అమర్ డ్యూటీల్లో ఒకటి! ఒక్కోరోజు శ్యామసుందరంతో పాటే పడుకునేవాడు!

** ** **

నిన్నటి నుంచీ అమర్ కనిపించక పోవడంతో, అతనేమయ్యాడో తెలియక బెంగ పెట్టుకుని దిగులుగా పడుకుంది సువర్చల.

ఇంతలో పనిపిల్ల గాబరాపడిపోతూ సువర్చల దగ్గర కొచ్చి "అమ్మగారూ! క్రింద హాల్లో పోలీసులు కూర్చుని వున్నారమ్మా. మిమ్మల్ని పిలుచుకు రమ్మన్నారు" అంది.

సువర్చల పని పిల్ల మాటలు విని వులిక్కిపడి లేచి, భయపడిపోతూ క్రిందికి దిగి వచ్చింది.

హాల్లో ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఆడ పోలీసులు వున్నారు. "మీరేనా సువర్చలగారు?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"అవునండి"

శ్యామసుందరం గారున్నారా?"

'లేరండి క్యాంపు కెళ్ళారు."

"మీ డ్రైవర్ని ఒక్కసారిలా పిలవండి."

"నిన్నటి నుంచి అతను రావడం లేదండి" అంది సువర్చల.

"మొన్న మీ డ్రైవర్ రాంగ్‌రూట్‌లో వస్తూ ఒక ముసలామెను గుద్దేయగా అరెస్ట్ చేశాం. మొన్న సాయంత్రం ఎవరో స్టేషన్‌కొచ్చి విడిపించుకు వెళ్ళారు. మీ డ్రైవర్ లైసెన్స్ మా దగ్గరే వుండిపోయింది. అదివ్వడానికి వచ్చాం. మీ డ్రైవర్‌ను విడిపించుకెళ్ళింది కూడా శ్యామ్‌సుందరంగారే. అంతేకాదు, ఆమెను మేము కొన్ని ప్రశ్నలడగాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

సువర్చల, ఇన్‌స్పెక్టర్ ఏమంటున్నాడో తెలియక—

"అదేమిటి డ్రైవర్‌ని 'ఆమె' అంటున్నారు" అంది అయోమయంగా.

"అవునండి అమర్ మగవేషంలో వున్న అమ్మాయి. ఆ అమ్మాయిపేరు రోజీ"

ఇన్‌స్పెక్టర్ మాటలు వినడంతోనే సువర్చల ముఖం పాలిపోయింది. వళ్ళంతా చెమటల్లుపోశాయి.

"మీరు చెప్పేది నిజమేనా?" అంది అతి కష్టం మీద.

"అవునండి బహుశా, రోజీ మీ వారి గర్ల్ ఫ్రెండ్ అయివుంటుంది" ఆడపోలీసులు ముసిముసిగా నవ్వుకున్నారు.

ప్రియురాలిని ఏకంగా ఇంట్లోకే తెచ్చి పెట్టుకున్న భర్త తెలివికి ఆశ్చర్యం, ఆ మోసాన్ని ఏమాత్రం తెలుసుకోలేని తన తెలివితక్కువ తనానికి సిగ్గూ మనసుని పెనవేయగా, రెండు చేతులూ తలమీద పెట్టుకుని సోఫాలో కూలబడిపోయింది సువర్చల.

